"దేముడనే వాడున్నాడు."

గిరుక్కున వెనక్కి తిరిగి కోర్టులోంచి వడివడిగా బయటపడి నడిచాడాయన. ఇద్దరూ తమ మీద పడ్డ ఆయన వుమ్మిని తుడుచుకున్నారు. ఆయన ప్రవర్తనకి ధర్మతేజ లక్ష్మీ ఆశ్చర్యపోలేదు.

హనుమాన్లు వాళ్ళ దగ్గరకి వచ్చి చెప్పాడు.

"హాయ్ హాయ్ సోదరా."

ఇద్దరిలో ఒకతను నవ్వుతూ అడిగాడు.

"నరుడా! ఏమి నీ కోరిక."

హనుమాన్లు ఆ మాటలన్న వ్యక్తి భుజంమీద గట్టిగా చరిచి చెప్పాడు.

"పద."

పోలీసులు విడుదల చేసిన ఇద్దరూ హనుమాన్లు భుజంమీద చెయ్యివేసి బయటకి నడవడం చూసింది నమ్రత. ఆ ఇద్దరూ ఆమెవంక, ఆమె పక్కనున్న జీవని వంక చూసారు కాని ప్రేయురాలిని పలకరించే ప్రయత్నం చెయ్యలేదు వాళ్ళలో ఎవరూ.

జనం వాళ్ళ దగ్గరకి వెళ్ళడానికి ప్రయత్నించారు

వేగంగా వస్తున్న ఆ జీప్ ఇద్దరిలో ఒకరిని ఢీ కొట్టింది.

ఆ తాకిడికి ఎగిరెళ్ళి అంత దూరంలో పడ్డా డతను. మెడ అసహజమైన కోణంలో విరిగింది. క్షణాల్లో రోడ్డు మీద ఎర్రని చారిక. అతన్ని గమనించి రెండో వ్యక్తి బాధగా అతని పేరు అరవ బోయాడు.

పక్కనున్న హనుమాన్లు రెండు చేతులూ అలా అరవ బోతున్న ఆ వ్యక్తి నోటిని మూసేసాయి గట్టిగా.

"ష్." చెప్పాడు బాధగా.

కోర్టులోంచి బయటకి వచ్చిన, వస్తున్న జనం ఆ ఘోరం చూసి అవాక్కయిపోయారు. ఒకే రకం రూపంలోవున్న ఇద్దరిలో మిగిలిపోయిన అతని చుట్టూచేరారు.

అతని కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. పెదవులు అదురుతున్నాయి.

"ఇప్పుడయినా చెప్పండి. మీ పేరేమిటి? చచ్చి పోయిందెవరు? ఎవరికి?"




పోలీసులు ఆ గుంపుని అజమాయిషీ చెయ్యాల్సి వచ్చింది. అందరినీ తప్పించుకుంటూ ఇద్దరూ బయటకి వచ్చారు.

"ముందర ఇక్కడనుంచి బయటపడాలి"-ఒకతను మరొకతనితో చెప్పాడు ప్రెస్ ఫోటోగ్రాఫర్లు అదే పనిగా ఇద్దరినీ ఫోటోలు తీస్తుండడంతో.

"పద."

ఇద్దరూ కోర్టు గేటుదాటి రోడ్డుమీదకి వచ్చారు. కొద్ది దూరంలో సిగార్ తాగుతున్న ఓ వ్యక్తి వాళ్ళని చూసి దాన్ని ఆర్పి జేబులో పెట్టుకుని జీప్‌ని స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు.

రోడ్డు దాటుతున్నారు ఇద్దరూ.

జీప్ వేగం అందుకుంది.

ఇద్దరిలో ఒకతను దాన్ని చూసి గట్టిగా కేక వేస్తూ వెనక్కి ఓ అడుగు వేసాడు. రెండో అతను దాన్ని చూడడం కొన్ని క్షణాలు ఆలస్యం అయింది.

అంతే!

పత్రికా విలేకరులు అతన్ని చుట్టుముట్టారు. కొందరు రోడ్డుమీద పడ్డ శరీరాన్ని ఫోటోలు తీయ సాగారు.

రోడ్డుమీద శవంగా మారిన తన సోదరుడి మీద పడి విలపిస్తున్నతన్ని హనుమాన్లు కొద్ది దూరంలో వున్న టేక్సీ దగ్గరకి బలవంతంగా తీసుకెళ్ళి అందులో కూర్చోపెట్టి, టేక్సీ స్టార్ట్ చేసాడు.

టేక్సీ కదులుతుండగా ఓ చెయ్యి కిటికీలోంచి లోపలికి వచ్చి ఆ వ్యక్తి భుజాన్ని ఓదార్పుగా తట్టింది. ఆ వ్యక్తి తలతిప్పి చూసాడు.

ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరిశ్చంద్రరావు.

"మే గాడ్ బ్లెస్ యు మై బాయ్" చెప్పాడాయన ఆర్ద్రంగా.

— ఇంకావుంది

## కాలమ్ దాటని కథ

## సీక్రెట్

సేఠ్ చందూలాల్ షాప్ వివిధ రకాల వజ్రాలతో, నగలతో మెరిసిపోతోంది కొత్త పెళ్లి కూతురిలా. విశాలమైన సోఫాలో కూర్చుని మోకాలి మీద పాడ్ పెట్టుకుని చందూలాల్ చెప్తున్న వివరాల్ని నోట్ చేసుకుంటున్నాడు ఇన్‌స్పెక్టర్. సరిగ్గా అరగంట క్రిందట పోయాయి రెండు లక్షల విలువైన వజ్రాలు. ఆ షాపులో వున్న ఖరీదైన వజ్రాల్లో అదొక జత. కోటీశ్వరుల పెళ్ళిళ్ళలో వధూవరులు మార్చుకునే ఉంగరాల కోసం వుద్దేశించబడిన వజ్రాల జత అది. అరగంట క్రితం వచ్చిన ప్రేమికుల జంట ఆ వజ్రాల జతని సెలక్టు చేసుకున్నారు. వారి దగ్గర ఇరవై వేలే వున్నాయి. వజ్రాలు తరువాత వచ్చి తీసుకుంటామని, అప్పుడే డబ్బిస్తామని, ఈ లోపల అవి ఎవరికీ అమ్మవద్దనీ రిక్వెస్ట్ చేశారు. వాళ్ళు చూడడానికి ఖరీదైన మనుషుల్లాగే కనిపించారు. ఆమె నగరంలో ఒక కోటీశ్వరుడి పేరు చెప్పి తను అతని కూతుర్నని చెప్పింది. ఆ వజ్రాలు వెంటనే తీసుకోలేక పోయినందుకు వాళ్ళ మొహాల్లో నిరాశ స్పష్టంగా కనపడింది. ఆమె చెప్పింది నిజమే అయితే వజ్రాలిచ్చేసి తర్వాత డబ్బు తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు చందూలాల్. ఆమె చెప్పింది ధృవపర్చుకోవాలని ఫోన్ చేయడానికి లోపలికెళ్ళాడు. కాని ఆమె చెప్పింది పూర్తిగా అబద్ధమని తేలింది. బయటికి వచ్చి చూసేసరికి వాళ్లూ లేరు! ఆ వజ్రాలూ లేవు!! సేల్స్‌మన్ నడిగితే వాళ్ళు వట్టి చేతులతోనే వెళ్ళారను కున్నానన్నాడు. ఇది చందూలాల్ చెప్పిన విషయం. తప్పకుండా దొంగల్ని పట్టుకుంటామని చెప్పి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్.

ఇదంతా చందూలాల్ కొడుకు సురేష్‌కేం అర్థం కాలేదు. బయట ఫోనుండగా లోపలి రూంకెందుకెళ్ళావని తండ్రి నడిగాడు. చెవిలో రహస్యంగా చెప్పాడు చందూలాల్.

"వాళ్ళు దొంగలని తెలుసు. అవి దొంగిలించబడాలనే వాళ్ళకా అవకాశం ఇచ్చాను. ఇప్పుడు మనకు లక్ష రూపాయిలు ఇన్స్యూరెన్స్ డబ్బు వస్తుంది."

"కాని రెండు లక్షల రూపాయిల వజ్రాలు పోయాయిగా" అడిగాడు కొడుకు. "అవి నిజమైనవి కావు. షోకేస్‌లో పెట్టేవి డూప్లికేట్స్. ఎందుకూ పనికిరాని గాజు ముక్కలవి. షో కేస్‌లో వున్న ప్రతీ డూప్లికేట్‌కీ ఐరన్ సేఫ్‌లో ఒరిజినల్స్ వున్నాయి. కస్టమర్స్ దేనిని సెలక్ట్ చేసుకుంటారో దాని ఒరిజినల్ లోపలి నుంచి తెప్పిస్తాను. ఇది నాకు మాత్రమే తెలిసిన రహస్యం. ఇప్పుడు చెప్పు మనకు లాభమా! నష్టమా!"

తను ఫారిన్‌లో చదివిన చదువు వ్యర్థమనిపించింది చందూలాల్ కొడుక్కి.